

# భీతి

శాంతామూర్తి

పువ్వులు చల్లిన పందిరిమంచం వద్ద ఒక మూలకు వేలాడదీసిన సన్నజాజి మొగ్గల మాలను పట్టుకుని నిల్చున్న

సుజాత దృష్టి, మెత్తటి, తెల్లటి పక్క మీదే నిలిచిపోయింది. అంతవరకూ చుట్టూచేరి, పరాచికాలాడుతూ, హాస్యోక్తు

లను విసురుతూన్న ఆడవాళ్ళు, మోహన్ లోపలికి రావడం పసిగట్టి, వెళ్ళిపోయారు. విశాలమయిన ఆ గదిలో ఒంటరిగా మిగిలిపోయింది సుజాత.

కిటికీనుండీ వీస్తున్న సన్నటి గాలికి ఆ మాలలు సొంపుగా ఊగుతూ నిల్చున్న ఆమె చెంపలను తాకుతూ, సున్నితమైన మెడను చుట్టేస్తూ, గుండెలమీద పడుతూ వున్నాయి. ఆ మాలలు అలా తాకినప్పుడల్లా చెప్ప లేని, ఏనాడు అనుభవించని గగుర్పాటు లాంటి అనుభూతి ఏదో కలుగుతూ వుంది. అలా చూస్తూ నిల్చున్న సుజాత కాళ్ళలో సన్నగా వణుకులాంటిది కలుగ సాగింది. మరి కొద్ది సేపటికే ఆ కంపన తనువెల్లా వ్యాపించింది. సరిగ్గా అప్పుడే గొళ్ళెంవేసిన చప్పుడు వినిపించడంతో భయంవల్ల పిడికిలి బిగుసుకుపోయింది. చేతిలోవున్న మొగ్గలదండ పిడికిలికి చిక్కి నలిగిపోయింది.

అడుగుల సవ్వడి దగ్గరవుతూన్న కొద్దీ చేతులేకాక, పెదవులూ కంపించ సాగాయి. పిడికిలి మరింత బిగుసుకు పోయింది. భుజంపై మెత్తగా చెయ్యి పడగానే ఎండుటాకులా కంపించుకు పోసాగింది సుజాత. వెనుక నిల్చున్న అతను ఇది పసిగట్టాడులా వుంది. అతను నవ్విన సన్నటి నవ్వు కర్ణేంద్రి యాల గుండా, గుండెలను తాకి వాటి స్పందనే ఆగిపోయేలా చేసింది. భుజంపై పడ్డ అతని అరచేయి మెల్లిగా జారి బిర్రబిగుసుకుపోయిన సుజాత పిడికిలిని చేతుల్లోకి తీసుకుంది.

ఒకచేత్తో ఆ చేతిని పట్టుకుని, మరొక చేత్తో అంటుకుపోయినట్టున్న అయిదు వేళ్ళనూ విడదీస్తూ, పిడికిలి బిగువును సడలించాడు.

"అయ్యో.... మొగ్గలన్నీ నలిగి పోయాయి." నలిగిన తెల్లని మొగ్గలను ఎర్రగా కందిన అరచేతిని చూస్తూ, ఆ మొగ్గల దండను అవలవుంచి చెమటతో తడిసి ముద్దయిన ఆ సుకుమారమయిన చేతిని సున్నితంగా చేతుల్లోకి తీసు కున్నాడు.

అతని ఆ చర్య కలిగించిన ప్రతిఘాత మేమోకానీ, గొంతు నొక్కేసినట్టూ, ఊపిరే ఆడనట్టు అయ్యింది పలుచగా పాలిపోయింది మోము. తడారిపోయింది నాలుక. ఆ నాలుకతో పెదిమలను తడుపుతుంటూ, గుటకలు మింగుతూ—

"నా.... కు.... భయం"

ఆపాదమస్తకమూ, చలిజ్వరం పట్టుకున్నదానిలా గడ గడా వణికి పోతూ అంది.

"అది నిన్ను చూస్తుంటే తెలు స్తోంది. ఇదుగో ఈ పాలు తాగు। గొంతు ఎండుకుపోయినట్టుంది." గోరు వెచ్చటి పాలను అందిస్తూ అన్నాడు.

"నాకొద్దు." అధికమయిన భీతివల్ల

ఏడుపు పొంగుతూ రాగా వెక్కి వెక్కి ఏడుస్తూ అంది.

"పోనీ మంచినీళ్ళయినా తాగు," చల్లటి నీళ్ళనందిస్తే వొద్దని, ముఖాన్ని దోసిట్లో దాసుకుని ఏడుస్తూ వుండి పోయింది పదిహేనేళ్ళ సుజాత ఇటువంటి సందర్భంలో అయిదేళ్ళ పసిపాపలా! ఏ భూతాన్నో చూసినట్టు జడుచుకుంటూ వుంటే నవ్వుకున్నాడు అతను.

"మరి ఏమిస్తే ఏడుపు మానతావు ?"

ప్రక్కన నిలబడి, భుజంచుట్టూ వేసిన చేతిని బిగిస్తూ తీగలా వణుకుతూన్న సుజాతను దగ్గరికి తీసుకుంటూ అన్నాడు. సుజాత ఏడ్పుస్థాయి పెరిగింది.

"హుంష్, గట్టిగా ఏడవకు. ఎవ్వరయినా వింటే నవ్వుతారు." అనునయిస్తూ అన్నాడు.

"నాకు భయం....నాకు భయం...." భయాన్నంతా కళ్ళలో నింపుకుని మరీ చూస్తూ, ఏడుస్తూ అంది.

పెళ్ళయిన అతని స్నేహితులు తమ తొలిరేయి అనుభవాలను చెప్తూ దాదాపు ప్రతి ఒక్కరూ ఆడవారు భయపడతారన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. మరీ ఇంతగా భయపడతారని అనుకోలేదు.

"అమ్మా, మహాతల్లీ! నిర్భయంగా పడుకో. నిన్ను దారికి తెచ్చుకోవడం నా కొక యజ్ఞంగానే వుంది. పడుకో పడుకో."

సుజాతను వదిలేసి, ముసుగుతన్ని పడుకున్నాడు, గాఢంగా నిట్టూర్చుతూ.

"ఈ భయాన్ని కాస్త తొలగించుకోవడానికి ప్రయత్నించు."

ముఖంపైన ముసుగు కొద్దిగా తీసి, మంచపుకోడువద్ద గువ్వలా ఒదిగి కూర్చున్న సుజాతను చూసి నవ్వలేక నవ్వుతూ అని మళ్ళీ ముసుగు బిగించాడు. అతనలా వొదిలి దూరంగా తొలగగానే ఆవహించిన భయం, మాంత్రికుని మంత్రదండం తగిలిన దానిలా పారిపోయింది.

"సుజా, నన్ను పెళ్ళిచేసుకోవడం నీకు ఇష్టం లేదా?" ముసుగులో నుండే అడిగాడు,

"ఇష్టమే."

"మరైతే ఎందుకీ భయం ?"

"తెలీదు."

"నువ్వు అనవసరంగా భయపడ్తున్నావు. అంతగా భయపడవలసినదేదీలేదు."

దానికి జవాబు చెప్పలేదు సుజాత.

"నేనంటే నీకు అసహ్యమా, అయిష్టమా ?"

మరో రెండు నిమిషాలకు మళ్ళీ అడిగాడు.

"లేదు లేదు. మీరంటే నాకు చాలా యిష్టం."

"మరి అటువంటప్పుడు, నేను నీ చెంతకు వస్తే అంత భయమెందుకూ"

"తెలీదు."

"నీ తెలియని భయం నాకు అవస్థగా వుంది."

"దీనిని తొలగించుకొనడానికి ప్రయత్నిస్తాను."

"నాకింత భయముందని నాకే తెలీదు, ఇప్పుడే తెలిసింది." అంది సుజాత మెల్లిగా.

మరోసారి సుజాతను దగ్గరకు తీసుకోబోయాడు.

"నా కెందుకో చాలా భయంగావుంది" ఆమె కాళ్ళు, చేతులూ బిగుసుకు పోయాయి. ఆ ప్రయత్నం మాను కున్నాడు.

## 2

ఎమ్.టెక్. చదివి బెంగుళూరులోని పెద్ద ఫ్యాక్టరీలో పెద్ద ఉద్యోగిగా వున్న మోహన్, ఉద్యోగం వచ్చిన రెండు నెలలకు పెళ్ళి చూపులకు సుజాతను చూడ్డానికి విడదవోలు వెళ్ళాడు. తొలి చూపులోనే మనసు చూరగొన్న ఆమెను వలచి, పెద్దలందరూ తథాస్తు అనగా మూడుముళ్ళూ వేసి, తనదాన్ని చేసుకున్నాడు. ఆమెతో కలిసిపోయే ఈ మధురక్షణాన భల్లూకంలా ఈ భయమొకటి వచ్చి రసభాస చేసేసింది. నిరాశతో నీలుక్కుపోయాడు.

ఆ మరుసటి రోజే సుజాతతో బెంగళూరు ప్రయాణమయ్యాడు.


"నా వంట మీకు నచ్చిందా." మరి కొంచెం పులుసువేస్తూ అడిగింది సుజాత.

"నీలో నాకు నచ్చనిదంటూ ఏదీ లేదు ఒక్కటి తప్పించి." ఈ మాటతో మామూలుగా మాటాడుతున్నదల్లా మూగదై తల దించుకొని గరిటెను గిన్నెలో తిప్పుతూ నిల్చుంది.

"చెప్పింది వినిపించిం దనుకుంటాను" చిరునవ్వుతో అడిగినదానికి బదులాడక పోయినా, తలను ఊపింది వినపడిం దన్నట్టు.

అటు తర్వాత, వెళ్ళేముందు మడత విప్పని ఇస్త్రీ చేతిగుడ్డను అందిస్తు న్నప్పుడు కూడా "భయసామ్రాజ్యానికి మహారాణిగారయిన శ్రీమతి సుజాతగారి కిదో విన్నపం. ఈ వారం రోజు లుగా మేము చేస్తున్న ఏకాదశి, శివ రాత్రులకు ఈనాడయినా జనగనమణ పాడిస్తారని అనుకుంటాను," అందించిన రుమాలును అందుకుంటూ, పొడవయిన ఆ నాసికను సున్నితంగా పట్టుకు వి లాగుతూ అన్నాడు. తల వంచేసుకుని బుద్ధిగా తలను ఊపింది.

ఇప్పుడే కాదు. చెప్పిన ప్రతిసారీ అలాగే గంగిరెద్దులా తలను ఊపుతూనే వుంది. కానీ తీరా ఆ సమయానికి, మళ్ళీ తనువెల్లా విద్యుత్తు ప్రాకిన తీగలా కంపించిపోయేది. చెమటలతో తడిసి ముద్దయిపోయిన ఆ సుజాత తీరుచూసి, మరుసటి రోజుకు వాయిదా




వేసేవాడు. "క్షమించాలి, ఈ భయాన్ని తొలగించుకోవడానికి ప్రయత్నిస్తాను, నాకు కొంచెం అవకాశ మివ్వండి," అన్న వేడుకోలును మన్నిస్తూ. ఈ ఏడు రోజులుగా ఇదే కార్యక్రమం తప్పక జరుగుతూనే వుంది. సుజాత భయాన్ని పోగొట్టడానికై మోహన్ చేయని ప్రయత్నమంటూ లేదు. గంటల తరబడి దాంపత్య జీవితం గురించి చెపుతూ-

"ఇది న్యాచురల్ ఫినామినన్ సుజా। నువ్వంతగా భయపడవలసిందేమీ లేదు," అంటూ ఎంతో ఇష్టంతో, ఆశతో దగ్గరికి తీసుకోబోతే రెపరెపలాడుతూన్న కళ్ళతో, కంపిస్తూన్న పెదవులతో, గడగడ వణుకుతూ—

"నా కెందుకో చాలా భయం। ప్లీజ్, నాకు కొంత గడువియ్యండి, నే నీ బెదురును తొలగించుకుంటాను," దాదాపు గుడ్ల నీరు కక్కుతూ అర్థిస్తూ వుంటే, కరిగిపోయాడు మోహన్.

ఆమెలో భయం పోగొట్టాలని కామ సూత్రాలను వైవాహిక జీవితం గురించి వ్రాసిన పుస్తకాలను తెచ్చి ఇచ్చాడు. చదివి వినిపించాడు.

"చూశావా, నువ్వు గిల్టీగా ఫీల్ అవుతూ, భయపడుతున్నావు. నువ్వలా తప్పుగా భావించనక్కరలేదు." చిలకకు చెప్పినట్టు చెప్పాడు. అయినా భయం సడలలేదు. ఇక లాభం లేదనుకుని—

"ఇక ఎన్నో రోజులు ఇలాగే చేస్తే ఊరకుండేది లేదు." బెదిరిస్తున్నట్టు అంటే బేలగా చూసింది. ఆ చూపులకు అతను అయిస్‌లా కరిగిపోయి—

"లేదు సుజా। నిన్ను బలవంతంగా పొందాలన్న ఆకాంక్ష కాదు. నువ్వు ఏ భయమూలేక, మనస్ఫూర్తిగా కోరు కున్నప్పుడే, నీవాడి నవుతాను," అన్నాడు. ఇలా రోజూ.... ఏదో రీతిగా, వెళ్ళేప్పుడు చెప్పడం, అలవా టయ్యింది.

వెళుతున్న వాడల్లా, ఆగి తలుపు వద్ద పడిన ఉత్తరాన్ని అందుకుని —

"సుజా, రేపు నా ఫ్రెండ్ విజయ్ వస్తున్నాడు," అన్నవార్తను చెప్పి వెళ్ళి పోయాడు ఆఫీసుకు. ఆ మోహన్ కొత్తగా పనిలో చేరడంవల్ల, సెలవు లేక వచ్చిన రోజునుండే ఆఫీసుకు హాజరుకావలసి వచ్చింది. ప్రొద్దున్న పదింటికి వెళ్ళితే, దీపాలు పెట్టే వేళకు ఇల్లు చేరుతాడు.

3

"ఏమిటి, భయసాంక్రామ్యగా రేమంటారు." రాత్రి భోజనం ముగించి అందించిన వక్కపొడుం వేసుకుంటూ అడిగినదానికి జవాబు చెప్పలేదు. తల వంచేసుకుంది.

"నీ యీ భయం తొలిగేసరికి, నేను ముసలివాడినయిపోతాను" విసుక్కుంటూ వెళ్ళిపోయాడు. అవును మరి కల్యాణ బ్రహ్మచారి కోరికలు, కల్లు తాగిన కోతిలా గంతులేస్తూ, మనిషిని పిచ్చివాడినిచేస్తూ వుంటే, కట్టుకున్న కొత్తపెళ్ళాం మిలా బెట్టు చూపుతూ వుంటే, ఏ మొగవాడు మాత్రం ఓర్పు వహించగలడు? హాల్లోని సోఫాలో జారగిలబడి, ఇంటి కప్పునే వెర్రిగా చూస్తూండిపోయింది. తల పగులగొట్టు కున్నా, ఎందుకింతగా భీతికలుగుతుందో అర్థం కావడంలేదు. నిస్సహాయంగా, లోలోపలే దుఃఖించింది. మోహన్ గదిలోనుండే—

"నాకు కాస్త నీళ్ళుపెట్టి వెళ్ళు," అన్నందుకు, మరచెంబుతో నీళ్ళను తీసుకుని అతనున్న గదిలోనికి వెళ్ళింది.

అప్పుడప్పుడే వుదయిస్తున్న బహుళ పాడ్యమి చంద్రుని వెలుగు, తెరచిన కిటికీలగుండా పడుతూ, గిలిగింతలు పెట్టుతూ పాల వెలుగుతో నిండివుంది. చేత మరచెంబుతో, పొంకంగా కట్టిన చీరలో, సిగలో గుభాళించు మల్లెలతో, పచ్చని గాజులు చేతులలో కళకళ లాడుతూండగా నిల్చున్న సుజాత, అమృతభాండం చేతబూని దేవదాన వులను మరులుగొలుపు మోహినిలా అగుపించింది. పైన నీలాకాశంలో రగులుతూన్న మదనతాపానికి అజ్యం పోస్తున్న నెలరేడు ఎదుట రంభలాంటి భార్య ఆ మనిషి నిలకడను పూర్తిగా పడవేసింది. అంతే, చేతిలోని పుస్త కాన్ని, అరటి తొక్కను విసిరేసినట్టు విసిరేశాడు. మరో క్షణంలోనే సుజాత అతని బలమయిన హస్తాలతో నలిగిపో సాగింది. ఆవురావురు మంటున్న అతని



పెదవులు, మెత్తని ఆ కపోలాల నందు కున్నాయి. సుజాతకు కలిగిన గగుర్పాటు వర్ణనాతీతం—

"నాకు భయం. మీకు తెలీదు నాకెంత భయంగా వుందో. అయ్యో .... నాకు చాలా భయంగా వుంది." దాదాపు ఆక్రోసిస్తూన్న ఆ నోటిని తన పెదవులతో గట్టిగా మూసేశాడు.

మరొక్క నిముషానికే—

"అబ్బా...." బాధగా అరుస్తూ పొదివి పట్టుకున్న సుజాతను వదిలేశాడు. అలా వదిలేయడం వల్ల, విడిపించుకోవడానికే పెనుగులాడుతూన్న సుజాత, ఆరడుగుల దూరాన వెళ్ళి నేలపై పడింది.

సుజాత గోటిగాట్లతో ఎఱ్ఱని రక్తం కారుతూ, ఆ మోవిపైపడ్డ చెదరని

నల్లని ముంగురులతో, నిప్పు సెగలను కక్కుతూన్న అగ్నిగోళ్ళల్లాంటి కళ్ళతో, అతని ఆ రూపం వికృతంగా భీకరంగా వుంది. అది చూసిన సుజాత రెండు చేతులలోనూ ముఖాన్ని దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చుండి పోయింది. మరో పలుకు పలుకని మోహన్ మంచంపై కూలబడిపోయాడు, అంతు చిక్కని ఆకాశంలోకి చూస్తూ.

4

"ప్రొద్దున్న నన్ను చూసిందే, ఆ రక్కులేమిటని అడిగావే, వాటి వెనుక వున్న కథ యిది."

టాంక్‌బండ్ పైనున్న పిట్టగోడను ఆనుకుని నిల్చుని, చేతికందిన గులక రాళ్ళను ఆ చెరువులోనికి విసురుతూ విశ్చలమైన నీళ్ళలో పడ్తూ అవి చేస్తున్న శబ్దాన్ని వింటూ, లేవదీస్తూన్న వృత్తపు తరంగాలను చూస్తూ, స్నేహితుడు విజయ్‌కు పూసగుచ్చినట్టు తన బాధ నంతా వెళ్ళగక్కుతున్నాడు మోహన్. ఆ స్నేహితుడు ఒక్క ముక్క కూడా విడువక అంతా విన్నాడు. విని, దీర్ఘా లోచనామగ్నుడై—

"మోహన్, సుజాతను మద్రాస్‌కు తీసుకురా. నాకు తెలిసిన సైకియాట్రిస్ట్‌కు చూపుదాం," అన్నాడు.

"ఇదేమయినా మానసిక వ్యాధి అంటావా," బెంబేలు పడిపోయాడు మోహన్.

"భయపడకు, పెద్ద జాడ్యమేమీ వుండదు. ఆయనతో సంప్రదిస్తే సరి పోతుంది." ధైర్యంచెప్పాడు. మద్రాసుకు ప్రయాణ మయ్యాడు మోహన్, సుజాత కూడా.

5

"అలాగా, ఆమెను రేపు ప్రొద్దున్నే ఎనిమిదింటికి తీసుకురండి, చూస్తాను."

పరాసరి సుజాతను తీసుకురాకుండా, స్నేహితులిద్దరు మాత్రమే వచ్చారు డాక్టర్ మధుసూదన్ వద్దకు. మోహన్ చెప్పినదంతా విన్నాక, అతను ఆ మాట అన్నాడు. ఆ మరుసటి రోజు సుజాతతో వచ్చారు. వాళ్ళను వెలుపలికి పంపి, ఒక్క సుజాతను మాత్రం వుండ మన్నాడు. వాళ్ళలా వెళ్ళగానే—

"మీరు ఇక్కడికి ఎందుకు రావలసి వచ్చిందో, తెలుసు ననుకుంటాను," కళ్ళజోడును సవరించుకుంటూ అన్నాడు. తెలుసన్నట్టు తలను ఊపింది.

"నేను కొన్ని ప్రశ్నలను అడుగు తాను. జవాబు చెప్పాలి."

సరేనంటూ తలను ఊపింది.

"మీకు మోహన్‌గారంటే అయిష్టమా ?"

"లేదు. చాలా ఇష్టం."

"అయితే ఆయనను ఇష్టపడే చేసు కున్నారన్నమాట."

"ఊ...."

"పెళ్ళికిముందు, మీకు దాంపత్య జీవితం గురించి తెలుసా."

"చూచాయగా తెలుసు."

"ఎలా తెలుసు ?"

"పుస్తకాల్లో చదివాను."

"ఇప్పుడు వచ్చే సెక్స్, రొమాంటిక్ లాంటి పుస్తకాలను చదివారా ?"

"లేదు."

"నా దగ్గర అబద్ధం చెప్పరాదు. మీ మనసు విప్పి, దాపరికం లేకుండా వుండాలి," చిరునవ్వుతో అన్నదానికి -

"లేదు. నిజంగా చదవలేదు. మా అమ్మ నాన్న అటువంటి విషయాల్లో చాలా స్ట్రిక్ట్. మా అన్నయ్య పరుపు కింద ఒకసారి చూసి బాగా చివాట్లు పెట్టి తగలబెట్టారు."

"ఐ. సీ" అంటూ - సుజాత వాళ్ళ కుటుంబం గురించి, ఆమె చిన్ననాటి రోజులగురించి, కాలేజి చదువు గురించి, హైస్కూలు విద్య గురించి, ఎన్నో ప్రశ్నలు వేశాడు. తనకున్న మనో వ్యాధికి, అతను వేస్తున్న ప్రశ్నలకు సామ్యమే లేదనిపించింది. అయినా అడిగిన వాటికి బుద్ధిగా సమాధాన మిచ్చింది. అలా అతనితో మాటలు కలపడంవల్ల, కొత్త అన్న భావన తొలగిపోయింది.

"మీరు ఎప్పుడయినా ఎక్కడయినా, స్త్రీ పురుషులు కలవడం చూశారా ?"

"లేదు."

"మనస్సును బాగా కలత పెట్టి, ఎన్ని రోజులయినా మరవకుండా చేసిన మాన భంగం లాంటివి వున్న కథల నేమయినా చదివారా ?"

"చదివినా అంతగా కలవరపెట్టిన కథలను చదవలేదు."

"పోనీ, చూశారా కనీసం సినిమాల్లో నయినా ?"

"నిజ జీవితంలో చూడలేదు, సినిమాల్లో చూశాను. కానీ గుర్తులేదు."

"ఏ సినిమాల్లో చూశారూ ?"

"ఈ మధ్య వచ్చిన ఒకటి రెండు సినిమాల్లో చూశాను." పేర్లు చెప్పింది.

"చూశాక భయపడ్డారా ?"

"అబ్బే, ఏం లేదండీ."

"మీవారు మీ చెంతకు వస్తే, మీకు కలిగే మనోభావం వివరించగలరా ?"

"ఆయన నన్ను తాకగానే నాకేదో ఓ రీతిగా వుంటుంది."

"మైమిరపుగా మత్తుగానా ?"

"ఆహ.... అస్సలలా వుండదు. నా గుండెలను అదిమేసినట్టుగా, నవనాడులూ ముడుచుకుపోయినట్టుగా, గొంతు గట్టిగా నొక్కేసినట్టుగా వుంటుంది. చాలా భయం కలుగుతుంది. అదెంత భయం కలుగుతుందో చెప్పలేను. అధిక భయం వల్ల గొంతు ఎండుకుపోతుంది. అతని చేతుల్లోనుండి విడిపించుకోడానికై నేల పడ్డ చేపలా విలవిలలాడుతుంది మనస్సు.

అప్పలు మోహన్ పట్టుకుంటూనే, ఊపిరే అడక ప్రాణం పోతున్నట్టనిపిస్తుంది. నా ఆ స్థితి వర్ణనాతీతం. అందుకే అతన్ని తాకనివ్వను. మరీ బలవంతం పెడ్తే, పెనుగులాడుతాను," అంటూ ఆ రోజు రాత్రి జరిగిన సంఘటన వినిపించింది.

"నేను ఆయనను అలా రక్కాలని రక్కలేదు." చెప్పి సిగ్గుతో తల వంచుకుంది.

"డాక్టర్, నా కెందుకలా అవుతుంది. ఇలా ఎవ్వరికీ కలుగదు. ఆయనకు ఎంత కంటకంగా వుందో తెలుసా. అది చూసి నే నెంత బాధపడ్తున్నానో తెలుసా? ఇదెక్కడినుండి దాపురించిన దరిద్రం డాక్టర్, నన్నిలా పీడిస్తూ వుంది." ఏడ్చేసింది.

"మీరు మరీ అంతగా దిగులుపడక్కరలేదు. యు విల్ బి ఆల్‌రైట్" ధైర్యవచనాలను పలికాడు.

"నిజంగా రెపరెపలాడుతూన్న ఆ కళ్ళలో గోరంతదీపంలా మెరుస్తూండగా అడిగింది.

"నిజం" అని —

"మీరు బాగా గుర్తుచేసుకోండి. మీ రెప్పుడయినా బాగా భయపడిన సంఘటన చూశారా? చూసి వుండాలి. లేదా మానభంగంలాంటి కథలు చదివి బాగా బెదిరివుండాలి."

"లేదు, లేదు. నన్నంతగా భయపెట్టిన సంఘటన ఏదీ ఇంతవరకూ నా జీవితంలో జరుగలేదు," నొక్కి చెప్పింది.

"మీరు కలలు కంటారనుకుంటాను."

"ఊఁ...."

"ఒకే రకం కలలు కనడం సంభవిస్తూ వుంటుందా?"


"మీరు కలలు అంటే గుర్తుకు వచ్చింది. నాకు సామాన్యంగా కలలో ఓ పెద్ద డేగ, పామును తన గోళ్ళ మధ్యన తోకపట్టుకుని వెళ్ళడం చూస్తూ వుంటాను. అదే స్వప్నం ఈ మధ్య తరచు వస్తూనే వుంటుంది."

"ఈ మధ్య అంటే పెళ్ళయ్యాకనా?"

"ఆ...."

"ఐసీ" పై పంటితో క్రింది పెదవిని నొక్కిపట్టి ఆలోచనలో వడ్డాడు.

"మనకు మన చిన్ననాటి రోజులు పూర్తిగా గుర్తుండవు. కానీ, ఒక్కొక్కటి మాత్రం బాగా గుర్తు వుంటుంది. ఉదాహరణకు, నేను చాలా చిన్నప్పుడు, ఎందుకో దేనికోసమో పదేపదే పరుగెత్తేవాడిని. ఎందుకలా వెళ్ళేవాడినో నాకు గుర్తులేదు, కానీ మా అమ్మ చెప్పింది, మధ్యాహ్నమయితే పాలకోవావాడు వచ్చేవాడట. వాడి బెల్ మోత వినగానే నేనలా పరుగెత్తేవాడనట. నా కదంతా గుర్తులేదుకానీ పరుగెత్తడం మాత్రం గుర్తు.




"మీకూ అలాగే మీ చిన్ననాటి జ్ఞాపకాలు ఏమయినా లీలగా గుర్తున్నవి వున్నాయా?" సుజాత కళ్ళలోకి లోతుగా చూస్తూ అన్నాడు.

"ఒక్కసారి మా అక్కతో ఏదో ఊరు వెళ్ళాను. అక్కడెందుకో చాలా ఏడ్చాను. జ్వరం కూడా వచ్చినట్టు గుర్తు. కానీ ఆ జ్వరం అలా ఏడ్వడం వల్ల వచ్చిందో లేక, మరి యింకెప్పుడు వచ్చిందో గుర్తులేదు."

* * *

బల్లపై, కళ్ళు తెరచి వెలుగుతూన్న దీపాన్నే తదేకంగా చూస్తూ పడుకుంది సుజాత. ఆ బల్లపక్కనే చూపులన్నింటినీ ఆమెపైనే కేంద్రీకరించి నిల్చున్నాడు మధుసూధన్. అతను ఆమెను హిప్నోటైజ్ చేశాడని, అతని చర్యలవల్లే తెలుస్తూ వుంది.

"ఒక్కసారి మీ అక్కయ్య ఊరు వెళ్ళావు. అక్కడ బాగా ఏడ్చావు...." చెప్తున్న అతని మాటను మధ్యలోనే త్రుంచి వేస్తూ, సుజాత చెప్పుకుపోసాగింది, ఆన్ చేసిన టేప్ రికార్డరులా.

"నేను, అక్కయ్య, బావగారు చీకటిపడ్డాక ఇంగ్లీషు సినిమాకు వెళ్ళాం. మేము వెళ్ళేప్పటికి పిక్చర్ మొదలయ్యింది.

అతికాముకుడయిన దుర్మార్గుడొకడు కనిపించిన ప్రతి కన్నె శీలాన్నీ అపహరించి చిత్రవధ చేసి, చంపివేసే ఇతివృత్తం గల పిక్చరది. అందులో—

ఒక స్త్రీని దేగలా మోసుకు వచ్చి గట్టిగా తన బాహువుల్లో బంధించి, అందిన చోటల్లా పిచ్చికుక్కలా కొరుకుతూ, వెడల్పయిన మంచంపై వేసి, మీదపడి, ఆమె ఎంతగా పెనుగు లాడుతున్నా వదలక, అతి క్రూరంగా మానాపహరణం చేసి, కడకు ఆ పరుపు పైనే గొంతు పిసికి చంపేస్తాడు." చెప్పడం ఆపింది. మధుసూధన్ అందు కున్నాడు.

"అది చూసి నీకు భయం. భయంతో పాటు జుగుప్స కలిగింది. స్త్రీ, పురుషుల కలయిక అంటే, అటువంటి హింసాత్మక మయిన చర్యే అన్న అభూతకల్పన నీలో బాగా పాతుకుపోయింది.

"కానీ, అది కాదు. మనసులు కలిసిన అనురాగమూర్తులను కలిపి, ఒకచేసన్న మధురమయిన భావాన్ని కలిగింపచేసేదే ఈ కలయిక. అది రాక్షసకాండవంటి మానభంగం కానేకాదు. అదొక తియ్యని కలయిక." ప్రతి పదం ఉలితో రాతిపై చెక్కినట్టు, నొక్కి నొక్కి చెప్పాడు.

"అమ్మబాబోయ్, ఇహ నీ చర్య చూస్తూ వుంటే నాకే భయంగా వుంది."

లతగా, పెనవేసుకుపోతూ, ఉంగరాల జుట్టులోనికి వేళ్ళు పోనిచ్చి, తపనగా, ఆమెపై ముద్రలను వేస్తున్న సుజాతతో అంటే, ఒరిగిపోయి, గుండెల్లో మోముదాచుకున్న సుజాతను గట్టిగా హత్తుకున్నాడు మోహన్.

